ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం: 28.0 కనిష్ఠం: 19.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

గురువారం 20 నవంబరు 2025



విశ్వప్రేమకు ప్రతిరూపం భగవాన్ సత్యసాయిబాబా. సమాజం, ప్రజలను ఆదుకోవడానికి సత్యసాయి నిరంతరం తపించారు. సేవే పరమ ధర్మమని బాబా చేసిన బోధనలే లక్షల మందికి మార్గం చూపాయి. లవ్ ఆల్... సర్వ్ ఆల్ అని బాబా బోధించారు. ఆయనతో పాటు ఆయన సంస్థలూ అదే పాటిస్తూ వస్తున్నాయి. మానవ సేవే మాధవ సేవ అని భావించి, ప్రపంచ వ్యాప్తంగా సేవ చేస్తున్నాయి. ఎక్కడ ప్రకృతి వైపరీత్యం వచ్చినా సత్యసాయి సేవాదళ్ వాలిపోతోంది. తాగునీరు, వైద్యం, విద్య, విపత్తు నిర్వహణ వంటి బాబా సేవలు అనిర్వచనీయం. భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను జరుపుకోవడం ఓ వరం. శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టం.

-ప్రధాని నరేంద్ర మోదీ



సత్యసాయి వంద రూపాయల నాణేలను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తదితరులు

విశ్వప్రేమికుడి వేడుక

పర్తికి తరలివచ్చిన భక్తజనం

హిల్ వ్యూ స్టేడియంలో సందడి

- సత్యసాయి సేవలను కొనియాడిన ప్రధాని మోదీ
- సత్యసాయి స్మారక నాణేలు, తపాలా బిల్లల ఆవిష్కరణ
- 'సుకన్య సమృద్ధి యోజన' పథకాన్ని ప్రారంభించిన ప్రధాని
- సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతులకు గిర్ గోవుల బహూకరణ
- సత్యసాయితో బంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం చంద్రబాబు

ఈ భూమిపై మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ సత్యసాయిబాబా. ప్రేమ, సేవ, ప్రశాంతతకు ఆయన ప్రతిరూపం. విశ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంతోషం అనే భావనతో ఆయన జీవించారు. ఆయన నడిచిన ఈ పుణ్యభూమిలో శతజయంతి వేడుకలు జరుపుకుంటున్నాం. ప్రేమ ఒక్కటే మతం... హృదయం ఒక్కటే భాష.. మానవత్వమే కులం... అన్ని చోట్లా దైవం ఉన్నారని ఆయన బోధించారు. నాస్తికుల్ని సైతం ఆధ్యాత్మికత వైపు నడిపించిన గొప్ప వ్యక్తి బాబా. బాబాతో నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. ట్రస్ట్ కార్యక్రమాలపై పలుమార్లు నాతో చర్చించారు. ఆయన సేవలే స్ఫూర్తిగా మానవాళికి అందరూ ఉపయోగపడాలి."



- సీఎం చంద్రబాబు నాయుడు







హిల్ వ్యూ స్టేడియంలోకి చేరుకుంటున్న భక్తులు



బాబా మహాసమాధికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

పుట్టపర్తి/టౌన్/రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలు పుట్టపర్తిలో వైభవంగా సాగుతున్నాయి. హిల్‌వ్యూ స్టేడియంతో బుధవారం నిర్వహించిన వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి (మిగతా 6లో..)

లోకేశ్ శిబిరానికి క్యూ



నారా లోకేశ్‌ను కలిసి బయటకు వస్తున్న మంత్రులు సత్యకుమార్, అనగాని సత్యప్రసాద్

కొత్తచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలకు వచ్చిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌ను కలిసేందుకు ప్రజాప్రతినిధులు, నేతలు క్యూ కట్టారు. పుట్టపర్తి విమానాశ్రయానికి ఉుంగళ వారం చేరుకున్న ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి లోకేశ్ రోడ్డుమార్గాన మామిళ్లపల్లి క్రాస్ వద్ద ఏర్పాటుచేసిన శిబిరానికి చేరుకున్నారు. అక్కడ టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశం అయ్యారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించినట్లు తెలిసింది. పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారని సమాచారం. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్యేల పనితీరుపై ఆరా తీసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు వైసీపీకి లేదు: ఎమ్మెల్యే



మడకశిర టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు వైసీపీ నాయకులకు లేదని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఏమాత్రం అభివృద్ధి చేయలేదని వైసీపీ నాయకులు మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బాలకృష్ణ ఎమ్మెల్యే అయ్యాక చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. వైసీపీ హిందూపురం ఇన్‌చార్జి దీపిక భర్త వేణు రెడ్డి.. ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచితంగా మాట్లాడడనీ, వీడియో బయటకు వస్తే తెలుగు రాష్ట్రాల్లో తిరగలేడన్నారు. అభిమానులు తట్టుకోలేక వైసీపీ కార్యాలయంపై దాడిచేశారన్నారు. అమరావతిలో డీజీపీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న టీడీపీ జాతీయ కార్యాలయంపై దాడిచేసి, వైసీపీ నాయకులు దౌర్జన్యానికి దిగితే ఒక్క కేసు పెట్టిన దాఖలాలు లేవన్నారు. అలాంటి వైసీపీ నాయకులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత ఉందా అని ప్రశ్నించారు. సింహంలాంటి బాలయ్యపై వీధికుక్క అయిన వేణు రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మరోసారి బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రండి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు పల్లె సింధూరారెడ్డి ఆహ్వానం



పవన్ కల్యాణ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

పుట్టపర్తి రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి ఆహ్వానించారు. సత్యసాయి జయంతి ఉత్సవాలకు వచ్చిన ఉప ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే, మాజీ మంత్రి కలిసి.. నియోజకవర్గంలో 19 రహదారులు,మొత్తం 72 కిలోమీటర్ల రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. అంతకు మునుపు లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్, మాజీ మిస్ వరల్డ్ ఐశ్వర్య రాయ్ బచ్చన్‌ను కలిశారు.



జాగిలంపై ఊరేగుతున్న వానరం

వైరం మరిచి... స్నేహం పంచి..

విశ్వాసానికి ప్రతీక జాగిలం. దారితప్పిన ఓ వానరం.. జాగిలం వద్దకు చేరింది. ఆ వానరంపై వైరం మరచి.. జాలి తలచింది. స్నేహం పంచింది. మిత్రుడిని వీపుపై ఎక్కించుకుని ఊరంతా తిరిగింది జాగిలం. ఓబుళదేవరచెరువు మండలంలోని గౌరాపురంలో బుధవారం వానరాన్ని జాగిలం ఎక్కించుకుని తిరుగుతుండడాన్ని చూసి ఊరి జనం ఆశ్చర్యపోయారు.

- ఓబుళదేవరచెరువు ఆంధ్రజ్యోతి

అన్నదాతకు ఆనందం

- పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదల
- నియోజకవర్గాల వారీగా నిర్వహణ



మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎంపీ బీకే, పరిటాల శ్రీరామ్, చిలకం మధు

ధర్మవరం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ సొమ్మును విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్కులను జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు. జిల్లాలోని రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.132.52కోట్లు, పీఎం కిసాన్ సొమ్ము రూ.46.24కోట్లు జమ చేశారు. ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో నియోజకవర్గానికి చెందిన పీఎంకిసాన్-అన్నదాత సుఖీభవ సొమ్ము మెగా చెక్కును ఎంపీ బీకే పార్థసారథి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు.. రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తున్నారన్నారు. అందులో భాగంగానే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌తో వారిని ఆదుకుంటున్నారన్నారు. కాగా, వేదికపై జిల్లా వ్యవసాయాధికారికి సీటు ఇవ్వకపోవడంతో కిందనే కూర్చుండిపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడాప్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, జిల్లా వ్యవసాయాధికారి రామునాయక్, మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ, ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ ముస్తఫా, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు, గొట్లూరు సర్పంచ్ పిట్టా నరసమ్మ నాయకులు పాల్గొన్నారు.

గుట్ట నక్కలు..!

పెనుకొండలో పేట్రేగిపోతున్న మట్టి మాఫియా

- కొండలు, గుట్టలను మింగేస్తున్న వైనం
- ఏపీఐఐసీ, రెవెన్యూ అటవీ భూముల్లోనూ తవ్వకాలు
- టిప్పర్లతో తరలింపు
- వారు చెప్పిన ధరకు కొనాల్సిందే
- గృహ నిర్మాణదారులపై అదనపు భారం



ఎక్స్‌కవేటర్‌తో గుట్టను తవ్వేస్తున్న దృశ్యం

కియ పరిశ్రమ వెనుక ఏపీఐఐసీ భూముల్లో మట్టిని తరలిస్తున్న దృశ్యం

పెనుకొండ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డివిజన్‌కేంద్రమైన పెనుకొండలో మట్టిమాఫియా పేట్రేగిపోతోంది. కూటమి అధికారంలోకి రాగానే ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు మట్టి అక్రమ తవ్వకాలు, రవాణాకు తెరలేపారు. ఇష్టారాజ్యంగా మట్టి దోపిడీ చేసి కొండలను సైతం కొల్లగొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా మట్టి దోపిడీ జరుగుతున్నా అధికారులు ప్రశ్నించకపోతుండడం గమనార్హం.

అటవీ, ఏపీఐఐసీ భూముల్లోనూ..

అటవీ, ఏపీఐఐసీ, రెవెన్యూ భూముల్లో మట్టిని కొల్లగొడుతున్నారు. కియ కార్ల పరిశ్రమ వెనుక వైపున ఉన్న ఏపీఐఐసీ, దుద్దేబండ, యర్రమంచి పరిధిలోని పంచాయతీ, అటవీ భూముల్లో ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వి, టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. లేఅవుట్లు, వేర్‌హౌస్‌లకు మట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. డివిజన్ కేంద్రంలోనే యథేచ్ఛగా మట్టి దోపిడీ సాగుతున్నా.. ఆయాశాఖల అధికారులు ప్రశ్నించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ, ఏపీఐఐసీ అధికారులకు విషయం తెలిసినా మిన్నకుండిపోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సామాన్య గృహనిర్మాణదారులకు భారం

కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలులోకి తెచ్చింది. దీంతో గృహ నిర్మాణదారులు సంబరపడ్డారు. వారికి మట్టి పెనుభారంగా మారింది. మట్టి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. టిప్పర్ రూ.4వేలకు విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి అదనంగా వసూలు చేస్తున్నారు. ఇంటి నిర్మాణంలో భాగంగా మట్టి కొనుగోలు సామాన్య గృహనిర్మాణదారుడికి భారం అవుతోంది. వారు చెప్పిన ధరకు మట్టి కొనుగోలు చేయాల్సిందే. ఇతరులు మట్టి తరలించేందుకు వాహనాలు ఏర్పాటుచేస్తే అధికారులను పురమాయిస్తారని తెలుస్తోంది. చేసేదిలేక అధిక ధరలకు మట్టి కొనుగోలు చేయాల్సిన దుస్థితి పెనుకొండలో దాపురించిందని గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఏపీఐఐసీ భూముల్లో మట్టి తవ్వకాలపై మూడుసార్లు పోలీసులకు ఫిర్యాదు చేశాం. మట్టి తరలింపును అడ్డుకున్నాం. ముగ్గురు సిబ్బందితో నిఘా ఉంచాం. మట్టి తరలింపుపై చర్యలు తీసుకుంటాం.

- నాగకుమార్, ఏపీఐఐసీ జెడ్‌ఎం



చిన్నారికి సుకన్య పథకం పాసు పుస్తకం అందజేస్తున్న ప్రధాని మోదీ



వసంత లక్ష్మి కూచిపూడి నృత్య ప్రదర్శన

విశ్వ ప్రేమికుడి వేడుక

(5వ పేజీ తరువాయి)

ఐశ్వర్యరాయ్ బచ్చన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు హాజరయ్యారు. దేశవిదేశాలకు చెందిన సేవ, రాజకీయ, క్రీడా, సినీ రంగాల ప్రముఖులు వేడుకలలో పాల్గొన్నారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి, ప్రశాంతి నిలయంలో నుంచి హిల్ వ్యూ స్టేడియానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కాన్వాయ్ వెళుతుండగా భక్తులు, ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి అభివాదం చేశారు. సాయిరాం.. సాయిరం అని నినాదాలు చేశారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంతు మందిరంలో సత్యసాయి మహాసమాధి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. సత్యసాయి సువర్ణ విగ్రహం ఎదుట కాసేపు కూర్చుని ప్రధాని ధ్యానం చేశారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం వంద మంది రైతులకు గిర్ ఆవులను ప్రధాని పంపిణీ చేశారు. గోవులకు గడ్డి తినిపించారు.



అన్ని దారులూ అటు వైపే..

సత్యసాయి శత జయంతి వేడుకలలో పాల్గొనేందుకు దేశ విదేశీ భక్తులు, ఉమ్మడి జిల్లా, స్థానిక భక్తులు, సామాన్యులు తరలివచ్చారు. హిల్ వ్యూ స్టేడియంలో జరిగే ఉత్సవాలకు బుధవారం తెల్లవారు జాము నుంచే క్యూ కట్టారు. పట్టణంలోని అన్ని దారులు స్టేడియంవైపై అన్నట్లు భక్తులు తరలివెళ్లారు. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ పట్టణంలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వేదికపై ప్రముఖులు

హిల్ వ్యూ స్టేడియంలోని ప్రధాన వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఆశీనులయ్యారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్ మాట్లాడుకుంటూ కనిపించారు. అందరూ కలిసి సత్యసాయి స్మారక నాణేలను, తపాలా బిళ్లలను ఆవిష్కరించారు. సత్యసాయి సేవలను, ఆయనతో తమకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 30 లక్షల మందికి సత్యసాయి తాగునీరు అందించడం, ఒడిసాలో వరద బాధితులకు ఇళ్ల నిర్మాణం, ఉచిత విద్య, వైద్య సేవలను తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయిబాబా జీవిత చరిత్ర, మహిమలు, అధ్యాత్మిక, విద్య, వైద్య సేవలకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను డిజిటల్ స్ర్కీన్స్‌పై ప్రదర్శించారు. సంగీత దర్శకుడు శివమణి డ్రమ్స్, గాయకులు సుధ, రఘునాథన్ బృందం సంగీత కచేరి భక్తులను అలరించాయి. వసంతలక్ష్మి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీమతి ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థుల, సత్యసాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గుజరాతీ నృత్యం, వర్ద డ్యాన్స్‌తో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు.



సత్యసాయి స్టాంపులను ఆవిష్కరిస్తున్న ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు



ప్రధాని మోదీకి జ్ఞాపికను బహూకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



పుట్టపర్తి ప్రధాన వీధిలో భక్తుల సందడి



ఈశ్వరమ్మ చిత్రపటం



హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు





వేడుకల్లో విదేశీ భక్తురాలు



సత్యసాయి మహాసమాధి వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్





సాయికుల్వంత్ హాలులో గేయాలు ఆలపిస్తున్న భక్తులు, హారతి ఇస్తూ..



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ శ్యాంప్రసాద్



ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి



మహాసమాధి పక్కనే కుర్చీ

● ప్రముఖుల హాజరు



హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకలలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ బీకే పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి పాల్గొన్నారు.

● ఆత్మీయ పలకరింపులు



సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్ తదితరులు వేదికపై ఆత్మీయంగా పలకరించుకున్నారు. సత్యసాయితో ఉన్న బంధాలను నెమరువేసుకున్నారు. సభ ముగియగానే సత్యసాయి మహా మంగళ హారతి పట్టారు. ప్రధాని, సీఎం సహా అందరూ లేచి నిలబడి హారతి గీతంలో గళం కలిపారు. చేతులు జోడించి లీనమైపోయారు.

● ప్రధానికి ఘనస్వాగతం



సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం 9.50 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాస వర్మ, అనగాని, సవిత, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరా రెడ్డి, పరిటాల సునీత, ఎంఎస్ రాజు, కందికుంట వెంకట ప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జీఎం శేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, వెంకటశివుడు తదితరులు స్వాగతం పలికారు.

● కొత్త కానుకలు



ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న అనంతరం రైతులకు ట్రస్టు తరపున ప్రధాని మోదీ గోదానం చేశారు. ముగ్గురు రైతులకు గిర్ ఆవులను అప్పగించారు. ఈ పథకం కింద మొత్తం వంద మంది రైతులకు గిర్ ఆవులను ఇచ్చారు. హిల్‌వ్యూ స్టేడియంలో పరిగి మండలానికి చెందిన జాహ్నవి, లయ, నల్లమాడ మండలానికి చెందిన సుమిత్ర బాయికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు తరఫున సుకన్య సమృద్ధి యోజన పోస్టల్ ఖాతా పాస్ పుస్తకాలను అందించారు.

● మార్మోగిన శివమణి డ్రమ్స్



శివమణి బృందం డ్రమ్స్ వాయిద్యంతో హిల్ వ్యూ స్టేడియం మార్మోగింది. కేరళ వాయిద్య కళాకారులతో అరగంటపాటు డ్రమ్స్, కొమ్ము వాయిద్యంతో భక్తులను ఉర్రూతలూగించారు. రెండు చేతులతో ఏకకాలంలో నాలుగు డ్రమ్ములను వాయిస్తూ అబ్బురపరిచారు.

● ముఖ్యమంత్రికి వీడ్కోలు

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పుట్టపర్తి విమానాశ్రయంలో పలువురు నాయకులు, అధికారులు వీడ్కోలు పలికారు. టీడీపీ నాయకులు నాని, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ మౌర్యభరద్వాజ్, ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.






'సత్యసాయి 1940లో తన 14వ ఏట 'అందిరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే సేవా మార్గాన్ని కుగ్రామమైన పుట్టపర్తిలో ప్రారంభించారు. సత్యసాయికి జన్మభూమి, ఖర్మ భూమి పుట్టపర్తి. సత్యసాయి శత జయంతి వేడుకలు వచ్చే వందేళ్లపాటు చేయబోయే సేవలకు పునాది కావాలి. సత్యసాయి సేవలు, బోధనలు, ప్రేమతత్వానికి విశ్వవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. సేవాదళ్ ఉంది. వీరందరూ సత్యసాయి సేవా మార్గంలో పయనించి, ఎనలేని సేవలు అందిస్తున్నారు. సత్యసాయి శివైక్యం అయిన తరువాత 15 సంవత్సరాలుగా సత్యసాయి సేవలను పారదర్శకంగా కొనసాగించడం మీ వల్లే సాధ్యమైంది. ఇదంతా సత్యసాయి ఆధ్యాత్మిక తత్త్వంతోనే సాగుతోంది. శతజయంతి వేడుకలకు హాజరైన ప్రపంచ వ్యాప్త సత్యసాయి కుటుంబానికి ధన్యవాదాలు..'

- ఆర్‌జే రత్నాకర్



'అత్యంత వెనుకబడిన జిల్లాలో పుట్టిన భగవాన్ సత్యసాయి బాబా రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేశారు. ప్రధాని మోదీ చేపట్టిన జల్ జీవన్ మిషన్ తరహాలో ఆయన ఈ ప్రాంత దాహార్తి తీర్చారు. జల్ జీవన్ మిషన్‌కు అంకురమే ఆయన చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు. ఏ ప్రభుత్వాలూ ఆలోచించని సమయంలోనే భగవాన్ సత్యసాయిబాబా ఈ ప్రాంత ప్రజలకు తాగునీటిని అందించాలని తలంచారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు సత్యసాయి తాగునీటి పథకానికి బాబా రూ.400 కోట్లు ఇచ్చారు. చంద్రబాబు అండగా నిలిచి సత్యసాయి సాగునీటి పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయన సేవాతత్పరకు ఎంత మంది ప్రభావితం అయ్యారో లెక్కే లేదు. ప్రపంచానికి వెలుగునిచ్చే మహోన్నత వ్యక్తి ఇక్కడ పుట్టడం మనందరి అదృష్టం'

-ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



'మనుషుల్లో ప్రేమ ఉన్నంత వరకూ భగవాన్ సత్యసాయి బాబా మన మధ్యలోనే ఉంటారు. మనం నిజం మాట్లాడితే సత్యసాయిబాబా మనతోనే ఉంటారు. అందరినీ ప్రేమించు... అందరికీ సేవ చేయి.. ఎవరినీ బాధించకు.. అని ఆయన చూపిన బాటలో మనమంతా నడవాలి. భగవాన్ చూపిన పవిత్ర మార్గాన్ని అనుసరిస్తూ శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, శ్రీసత్యసాయి సేవా సంస్థలు సమాజానికి విశేషమైన సేవలను అందిస్తున్నాయి. పేదలకు ప్రేమతో సహాయం అందించాలని బాబా చెప్పిన మాటలు నాకు స్ఫూర్తి. భగవాన్ చెప్పినట్లుగా పిల్లలకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పడం నా ధ్యేయం. మనుషుల్లో దేవుడిని చూశారు భగవాన్... ప్రేమతో ప్రపంచాన్ని గెలిచారు..'

- ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్

నన్ను సాయిబాబా అనే వారు..



ఐదేళ్ల వయస్సులో పాఠశాలలో, బయట నా జుట్టును చూసి సాయిబాబాలా ఉన్నాడు అనే వారు. అప్పట్లో నాకు ఏదీ అర్థమయ్యేదికాదు. సత్యసాయి బాబా దర్శనంతో నాకు అసలు విషయం అర్థమైంది. 19 ఏళ్ల వయస్సులో మొదటిసారి వైట్‌ఫీల్డ్‌లో సత్యసాయి దర్శనం చేసుకున్నాను. ఆ తరువాత పలుమార్లు సత్యసాయి దర్శనానికి వెళ్లాను. ఇదే స్టేడియంలో 1997లో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు సమక్షంలో క్రికెట్ ఆడాం.. విజయం సాధించాం. అవన్నీ ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. సత్యసాయిని ఎన్నో ప్రశ్నలు అడగాలని అనుకున్నాను. కానీ అడగలేకపోయారు. ఎవరినీ తక్కువ అంచనా వేయకూడదని, ఒక నిర్ణయానికి రాకూడదని సత్యసాయి అప్పట్లో చెప్పేవారు.

-సచిన్ టెండూల్కర్

నేనూ బాలవికాస్ విద్యార్థినే..



ఆనాడు, ఈనాడు నేను బాలవికాస్ విద్యార్థినే. సత్యసాయి బాలవికాస్ విద్య ద్వారానే నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను. బాలవికాస్ విద్య బాల్యంలోనే విలువలను, క్రమశిక్షణను, ఆధ్యాత్మికతను బోధిస్తుంది. భవిష్యత్తుకు మూలం ఇది. జీవితానికి విద్య ఒకటే ప్రమాణికం కాదు, విలువలు, సామాజిక స్పృహ, సేవాభావం వంటివి కావాలన్నది సత్యసాయి బోధనల తత్త్వం. సత్యసాయి బాబా ప్రేమ, సేవ, దయకు సరిహద్దులు లేవు. ఏపీ, కర్ణాటక, తమిళనాడులో లక్షలాది మందికి తాగునీరు అందించడం, గ్రామీణాభివృద్ధి, యువత శక్తి వృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేయడం బాబా అపారమైన సేవాశక్తికి నిదర్శనం. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలు సత్యసాయిబాబా జీవితం. ఈ విలువలను మనం ఆచరణలో పెట్టడమే నిజమైన భక్తి.

- ఐశ్వర్యారాయ్ బచ్చన్, బాలీవుడ్ నటి

నేడు పుట్టపర్తికి కేంద్రమంత్రి గడ్కరీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలలో పాల్గొనేందుకు కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తికి వస్తున్నారు. ఆయన ఉదయం 6.30 గంటలకు నాగపూర్ విమానాశ్రయం నుంచి బయలుదేరి 8.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుని, సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం జిల్లాలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతి గురించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి నాగపూర్ బయలుదేరతారు.

రాష్ట్ర మంత్రులు కూడా..

భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం పుట్టపర్తికి వస్తున్నారు. సత్యసాయి శతజయంతి వేడుకలు ముగిసేవరకు ఆయన పుట్టపర్తిలోనే ఉంటారు. జయంతి వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కూడా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి గురువారం వస్తున్నారు.

ప్రశాంతి నిలయంలో నేడు..

సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి ప్రపంచ సదస్సు నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి గడ్కరీ హాజరవుతున్నారు. ప్రపంచ శాంతి కోసం జరిగే ఈ సదస్సులో 45 దేశాలకు చెందిన 2500 మంది ప్రతినిధులు పాల్గొంటారు. సాయంత్రం యువత భక్తిగీతాల ఆలాపన ఉంటుంది.

ఎలా ఉండేది..?

- వేళకు వచ్చి వెళ్లిపోతున్న వార్డెన్
- వంట మనిషి లేరు.. కాపలా ఉండేవారూ లేరు
- పైకప్పు పెచ్చులూడుతున్న గదులు
- తాండవిస్తున్న అపరిశుభ్రత
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు
- అధ్వానంగా చియ్యేడు గిరిజన బాలుర వసతి గృహం



తాడుతో వేలాడ తీసిన లైటు



చియ్యేడు గిరిజన బాలుర వసతి గృహం



భవనంలోపల వరండాలో దెబ్బతిన్న బండల పరుపు

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గిరిజన సంక్షేమ వసతిగృహంలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఈ హాస్టల్‌లో విద్యార్థులకు వంట చేసే సిబ్బంది కూడా లేరు. కొన్నేళ్లుగా బయటి వ్యక్తులతోనే వంట చేయిస్తున్నారు. పర్యవేక్షణ కొరవడటంతో వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఏగది చూసిన పైకప్పు పెచ్చులూడిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. విద్యుత్ లైట్లను కూడా తాళ్లతో వేలాడితీసిన పరిస్థితి. హాస్టల్ వరండాలోను ఇదే దుస్థితి. వరండాలో బండలు పైకి లేచాయి. ఎటుచూసినా అపరిశుభ్రతే. విద్యార్థులుండే గదులు మొదలుకొని హాస్టల్ ఆవరణ, పరిసరప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్ల కంపు కొడుతున్నాయి. ఇలా విద్యార్థుల భద్రత గాల్లో దీపంలా మారింది.

రోగాలతో విద్యార్థులు

వసతిగృహంలో మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ నాలుగు నుంచి పదో తరగతి చదివే పిల్లలు మొత్తం 44మంది ఉన్నారు. ఏ గదిలో చూసినా పెచ్చులూడిన పై కప్పులు, బీటలు వాలిన గోడలు, పగిలిన బండలు, పగిలిన కిటికీలే కనిపిస్తాయి. వసతి గృహం చుట్టు పిచ్చి మొక్కలు పెరిగడంతో విషపురుగుల తాకిడి పెరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో కొన్ని చోట్ల మరమ్మతులు జరిగినట్లు సమాచారం. అయితే ఈ హాస్టల్‌కు ఆ మరమ్మతులు వర్తించలేదు. అసలు ఈ హాస్టల్ అధికారులు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కుక్, కమాటీ (హెల్పర్), వాచ్‌మన్ పోస్టులు ఖాళీ

చియ్యేడు గిరిజన సంక్షేమ వసతిగృహంలో కుక్, కమాటీ, వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంక్షేమ వసతిగృహాలకు ఆ పోస్టులే కీలకం. అధికారులు పట్టించుకోకపోవడంతో బయటి నుంచి ఓ వ్యక్తితో వంట చేయించుకుని, అతడికి నెలకు కొంత ముట్టచెబుతున్నారు. ఇక మిగిలిన ప్రతి పనిని విద్యార్థులే చేసుకోవాల్సి వస్తోంది. విద్యార్థులే అన్నం వడ్డించుకోవడం, పాత్రలు కడుకోవడం మొదలుకొని కొన్ని సందర్భాల్లో వంట చేయడానికి హెల్పర్లుగా మారుతున్నారు. ఖాళీ ఉన్న పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసుకునే వీలు సంక్షేమశాఖల్లో ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

ఉన్నతాధికారులకు చెప్పాం

వసతి గృహంలోని సమస్యలను మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నాతోపాటు అటెండర్ మాత్రమే ఇక్కడ పని చేస్తున్నాడు. అతడికి వంట రాదు. దీంతో బయటి వ్యక్తితో వంట చేయించి పిల్లలకు పెడుతున్నాం. ఈనెల 20తేదీపైన ఒకరిని కేటాయిస్తామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. భవనం పెచ్చులూడిపోయింది. రెండు నెలల కిందట ఇంజనీర్ వచ్చి మొత్తం పరిశీలించారు. మరమ్మతులకు రూ.25లక్షల వరకు అవుతుందని అంచనా వేశారు.

- ప్రతాప్, హాస్టల్ వార్డెన్, చియ్యేడు



పెచ్చులూడిన విద్యార్థులుండే గదులు, వసతి గృహం వరండా

రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ...

వసతి గృహంలో వాచ్‌మన్, ఇతర సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. నగరంలోని ఓ వసతి గృహంలో పని చేస్తున్న అటెండర్‌ను మూడేళ్ల కిందట అక్కడకు పంపారు. ఆయన ఉదయం నుంచి రాత్రి వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. వార్డెన్ ఉదయం రావడం హాజరు నమోదు చేసి వెళ్లిపోవడం, తిరిగి సాయంత్రం రావడం రాత్రి విద్యార్థుల భోజనం అనంతరం వెళ్లిపోతు న్నారు. దీంతో తమకు రక్షణ ఉండేవారు ఎవరూ లేక రాత్రంతా విద్యార్థులు బిక్కు..బిక్కుమంటూ ఉండాల్సిన దుస్థితి నెలకొంది. పొద్దుకాని పొద్దులో ఏదైనా జరిగినా, ఇబ్బంది వచ్చినా విద్యార్థులు పరిస్థితి అంతే? జ్వరం వచ్చిన, కడుపునొప్పి వచ్చిన రాత్రంతా రగ్గు కప్పుకొని ముడుక్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వసతి గృహం ఊరికి దూరంగా ఉండటంతో అక్కడ జరిగే ఏ విషయమూ గ్రామస్థులకు త్వరగా తెలిసే పరిస్థితి లేదు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన వసతి గృహం పరిసర ప్రాంతం

అరటి కిలో రూ.6కి తగ్గకూడదు

- కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అరటి కిలో ధర రూ.6కి తగ్గకుండా రైతుల నుంచి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆనంద్.. వ్యాపారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని అరటి వ్యాపారులు, ఎగుమతిదారులు, ఉద్యాన, మార్కెటింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ధర నియంత్రణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 38,984 ఎకరాల్లో అరటి సాగులో ఉందన్నారు. అరటి రెండో పంట నాణ్యతగా లేకపోవడం, మహారాష్ట్రలో అధికంగా దిగుబడి రావడంతో అరటి ధర కిలో రూ.2 నుంచి రూ.3కి పడిపోయిందన్నారు. రీటైల్ ధర మాత్రం కిలో రూ.25పైనే ఉందన్నారు. ఎగుమతిదారులు ఇతర దేశాల మార్కెట్‌కు కిలో రూ.8కి తగ్గకుండా కొనుగోలు చేయాలని సూచించారు. లేనిపక్షంలో జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న మహిళా సంఘాల ద్వారా రైతుల నుంచి అరటి కొనుగోలు చేసి, ప్రజలకు ఇళ్ల వద్దకే అమ్మకాలు చేపడతామన్నారు. తద్వారా వ్యాపారులకు నష్టం వాటిల్లుతుందన్నారు. అరటి పంట నాణ్యత పెంపుపై దృష్టిపెడితే ఎగుమతులు పెరిగే అవకాశం ఉందన్నారు. నాణ్యత పెంచేందుకు ఫ్రూట్ కేర్ పద్ధతిని ఉద్యానశాఖ రాయితీని వినియోగించుకోవాలన్నారు. మహారాష్ట్ర అరటి ధరకు సమానంగా జిల్లా రైతులకు కూడా రైలు రవాణా సౌకర్యం కల్పించటానికి రాయితీ ఇవ్వాల్సిందిగా ఎగుమతిదారులు కోరారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి రాఘవేంద్రకుమార్, గ్రామీణాభివృద్ధి పీడీ శైలజ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో నగదు వద్దు

పీఆర్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వర్ణపంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పన్నులు చెల్లించేలా చూడాలనీ, నగదు లావాదేవీలకు అవకాశం ఇవ్వొద్దని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ జూమ్ మీట్ ద్వారా జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన జూమ్‌మీట్‌కు డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, డీడీఓలు నాగశివలీల, విజయలక్ష్మి, నాగేశ్వరరావు హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ.. స్వామిత్వకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏఓలు నాగరాజు, సోముశేఖర్, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.27తో, సరసరిగా రూ.33తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2145 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పంట సంకటం..!

సందిగ్ధంలో శింగనమల చెరువు ఆయకట్టు రైతులు

- పంటకు నీరు సరిపడుతుందో.. లేదోనన్న సందేహం
- తక్కువైతే నష్టపోతామన్న ఆందోళన
- నీరివ్వాలని వేడుకోలు




సాగుకు ఆయకట్టు భూములను సిద్ధం చేసుకున్న రైతులు

శింగనమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శింగనమల చెరువు ఆయకట్టు రైతులకు కొత్త చిక్కు వచ్చిపడింది. చెరువులో నీరు ఉంది. 75 శాతమే ఉంది. ఆ నీరు పంటకు సరిపడుతుందా, చివరి ఆయకట్టుకు అందుతుందా.. అన్న సందేహాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. దీంతో పంట సాగుకు తటపటాయిస్తున్నారు. చెరువులో నిండుగా నీరు ఉండుంటే నిర్భయంగా పంట పెట్టేవారు. 75 శాతమే ఉండడంతో తటపటాయిస్తున్నారు. నీరు చాలకపోతే పంటను కోల్పోవాల్సి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భూములను సిద్ధం చేసుకున్నా.. వరి సాగు చేయాలా.. వద్దా.. అని సందిగ్ధంలో ఉన్నారు.

భిన్న అభిప్రాయాలు

శింగనమల శ్రీరంగనాయకుని చెరువుకు ఇటీవల వర్షాలకు నీరు చచేరింది. చెరువు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం టీఎంసీ కాగా.. 0.75 టీఎంసీ మేర నీరు ఉంది. చెరువు ఆయకట్టు భూముల్లో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. దాదాపు 1500 ఎకరాల్లో వరి సాగుకు శింగనమల, గోవిందరాయునిపేట, శివపురం, సి.బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజుకాల్వ, సోదనపల్లి గ్రామాల రైతులు భూములు దుక్కులు చేసుకున్నారు. చెరువులో నీరు చివరి ఆయకట్టు భూముల వరకు, పంట చివరి వరకు సరిపడుతుందా.. లేదా.. అని సందేహంగా ఉన్నారు. చివరి ఆయకట్టు రైతులు పంట పెట్టడానికి మొగ్గు చూపడంలేదని తెలుస్తోంది. ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటే సరిపోతుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. హెచ్చెల్సీ నీరు వదిలితే.. పంటకు ఢోకా ఉండదని మరికొందరు కోరుతున్నారు.

చివరి వరకు నీరుంటే పంట పండుతుంది



పోతురాజుకాల్వ ఆయకట్టు భూములు చివర ఉన్నాయి. చెరువులో సరిపడా నీరు ఉందని పంట సాగుకు సిద్ధం చేసుకున్నాం. కొందరు రైతులు పంట ముగిసే వరకు నీరు రాదన్న ఉద్దేశంతో తటపటాయిస్తున్నారు. నీటిని వృథా చేయకుండా వాడుకుంటే పంట పండుతుంది.

-రైతు శ్రీరాములు, పోతురాజుకాల్వ

వంతులవారీగా వాడుకోవాలి



పంటకు అవసరమైన నీరు ఉం దన్న నమ్మకంతోనే నెలాఖరులో పంట సాగు చేస్తున్నాం. రైతు లు వంతులవారీగా నీటిని వా డుకుంటే పంటకు సరిపోతుంది.

-రైతు చాకలి నాగేంద్ర, గోవిందరాయునిపేట

తక్కువ వస్తే.. నీరు వదలాలి



చెరువు ఆయకట్టులో పంట సాగుకు సిద్ధం చేసుకున్నాం. చెరువులో పంటకు అవసరమైన నీరు లేదని రైతులు ఆందోళనతో ఉన్నారు. పంటకు చివరలో నీరు తక్కువ వస్తే పరిస్థితి ఏంటన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు చొరవ చూపి, నీరు విడుదల చేయించాలి.

-రైతు మునేంద్ర, చిన్నజలాలపురం

చెరువుకు నీరు తీసుకొస్తాం




చెరువు ఆయకట్టు భూముల్లో వరి సాగుకు రైతు లు సిద్ధమవుతున్నారు. చాలామంది చెరువులోని నీరు పంటకు సరిపడుతుందో.. లేదోనన్న అనుమానంతో ఉన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లాం. నీరు తక్కువ వస్తే.. హెచ్చెల్సీ ద్వారా ఇస్తామని భరోసా ఇచ్చారు. పంటకు ఏ ఇబ్బందీ ఉండదు.

-గార్లదిన్నె సత్యనారాయణ, శింగనమల ఆయకట్టు సంఘం అధ్యక్షుడు

తనివితీరా నీరు

- హెచ్చెల్సీ, హంద్రీనీవాకు అదనపు జలాలు
- సాగవుతున్న ఆయకట్టు పొలాలు
- అన్నదాతల్లో ఆనందం



హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాలు



అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఈ దఫా నీటి కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయి. దీంతో ఆయకట్టు రైతులు మురిసిపోతున్నారు. ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటి వనరులుగా హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ ఉన్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా జిల్లాకు నీరు చేరుతుంది. శ్రీశైలం డ్యాం నుంచి మల్యాల వద్ద ఎత్తిపోతల పథకం కింద హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాకు కృష్ణా జలాలు వస్తాయి. మునుపెన్నడూ లేనివిధంగా హంద్రీనీవా ద్వారా 50 టీఎంసీల నీటిని రాబట్టేందుకు ఇంజనీర్లు కృషి చేస్తున్నారు. హెచ్చెల్సీలో గేట్ల మరమ్మతులతో టీబీ డ్యాంలో నీటినిల్వ 80టీఎంసీలకే పరిమితం చేశారు. అయితే కొన్ని గేట్లు అమర్చడంతో టీబీ డ్యాంలో నీటి నిల్వ లభ్యతను 168టీఎంసీలకు పెంచడంతో హెచ్చెల్సీకి అదనపు జలాలు కేటాయించారు. ఈ ఏడాది మొదట హెచ్చెల్సీకి 24టీఎంసీల నీటిని కేటాయించారు. తర్వాత అదనంగా 3.707టీఎంసీలు కేటాయించారు. అదనంగా వచ్చే జలాల్లో హెచ్చెల్సీ వాటా 1.707టీఎంసీలుగా కాగా... కేసీ కెనాల్ డైవర్షన్ కింద 2 టీఎంసీల నీటిని ఇవ్వనున్నారు. దీంతో హెచ్చెల్సీకి 27.775టీఎంసీల నీరు కేటాయించినట్లు లెక్క తేల్చారు. అలాగే హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ చేపట్టడంతో హెచ్ఎన్ఎస్ఎస్‌లో నీటి వృథా తగ్గి, ప్రవాహ వేగం పెరిగింది. దీంతో శ్రీశైలం డ్యాం నుంచి నీటిని వేగంగా తీసుకోవడానికి అవకాశం ఏర్పడింది.

పెరిగిన కేటాయింపులు

హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి కావడంతో నీటి కేటాయింపులు పెంచారు. శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా కాలువకు అధికారికంగా 40టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. శ్రీశైలం డ్యాంలో నీటి లభ్యత పెరడగంతో ఈ ఏడాది అదనంగా మరో 10టీఎంసీలు రాబట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. జూలై 17న శ్రీశైలం డ్యాం మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటి విడుదల ప్రారంభించారు. ఇప్పటి వరకు హంద్రీనీవాకు 22టీఎంసీల నీటిని వదిలారు. హెచ్ఎన్ఎస్ఎస్‌లోని చివరి ప్రాంతం కుప్పానికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకెళ్లారు. డిస్ట్రిబ్యూటరీలు (పిల్ల కాలవలు) నిర్మిస్తే కరువు సీమలో మరింత భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది.

హంద్రీనీవా నీటితో పంట పండించా...



హంద్రీనీవా కాలువ కింద మా పొలం ఉంది. పూర్తిగా నీళ్లు రావడంతో ఐదెకరాల పొలంలో పత్తిపంట సాగుచేశా. నీళ్లు సక్రమంగా వస్తుండటంతో పంట బాగా వచ్చింది. రెండో పంటకూడా వేసుకోవడానికి చూస్తున్నాం. ఈ దఫా ఎక్కువగా నీళ్లు వస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఇట్లే నీళ్లు వస్తే దిగుబడి పెరిగి, అప్పుల నుంచి బయటపడొచ్చు.

-తిమ్మప్ప, గడేహొతూరు, వజ్రకరూరు మండలం

50 టీఎంసీలు రాబట్టేందుకు కృషి



ఈ దఫా హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ చేశాం. దీంతో అధికనీటిని శ్రీశైలం డ్యాం నుంచి తీసుకునేందుకు కృషి చేస్తున్నాం. హంద్రీనీవాకు కేటాయించిన 40టీఎంసీలతో పాటు అదనంగా మరో 10టీఎంసీలు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక టీబీ డ్యాంలో గేట్ల రిపేరీ ఉన్నందున నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి కేటాయింపులు చేశారు. అదనంగా మరో 3టీఎంసీలకు పైగా నీటిని కేటాయించారు. హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా వచ్చే నీరు ఆయకట్టు రైతులకు ఎంతో ఊరట కలిగిస్తోంది.

-నాగరాజు, ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈ

నేడు ఎంఈఓలు, హెచ్‌ఎంల సమావేశం

అనంతపురం విద్య, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అనంతపురం, మధ్యాహ్నం గుత్తి డివిజన్ వారికి జిల్లా సైన్స్‌సెంటర్‌లో సమావేశం ఉంటుందన్నారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు హాజరుకావాలన్నారు.

సకాలంలో డ్రిప్ పరికరాలు సరఫరా చేయండి

ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు సకాలంలో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల ఏపీఎంఐపీ పీడీలు, ఏపీడీలు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నమోద చేసుకున్న రైతులతో సబ్సిడీయేతర డబ్బు కట్టించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. చెల్లించిన రైతులకు త్వరగా మంజూరు ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు పరికరాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు రైతు పొలాల్లో పరికరాలు బిగించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ధనుంజయ పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నిర్వహించిన ఫార్మాడీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు, పరీక్షల విభాగ కంట్రోలర్ ఆచార్య శివకుమార్ తదితరులు బుధవారం విడుదల చేశారు. ఫార్మాడీ మొదటి సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఐదో ఏడాది సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు ప్రకటించారు. ఫలితాలు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కంట్రోలర్లు ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు.

ఉపాధ్యాయుడి ప్రతిభ

రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో పతకాలు

జాతీయస్థాయికి ఎంపిక



నరేష్‌కుమార్

రొద్దం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచిసముద్రం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నరేష్‌కుమార్ పరుగు పోటీల్లో సత్తాచాటారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ మైదానంలో బుధవారం నిర్వహించిన అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. పరుగు పందెం 400మీటర్లలో ప్రథమ, 100 మీటర్లలో ద్వితీయస్థానం సాధించారు. తద్వారా బిహార్‌లోని పాట్నాలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఆయనను కంచిసముద్రం వాసులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు జయభాస్కర్, అరవింద్ అభినందించారు.

జడ్పీ సీ, హెచ్ సెక్షన్ల ఏఓగా ముత్యాలరెడ్డి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగోన్నతిపై ఏఓగా నియమితుడైన ముత్యాలరెడ్డికి సీ, హెచ్ సెక్షన్ల బాధ్యతలు అప్పగించారు. ఏఓ ఫణిశేఖర్‌రెడ్డికి ఐ సెక్షన్ కేటాయించారు. జీ సెక్షన్ ఏఓగా ఉన్న రత్నాబాయి ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా వెళ్లడంతో ఆ స్థానంలో పెన్షన్ సెక్షన్ ఏఓగా ఉన్న విజయ్‌భాస్కర్‌రెడ్డిని నియమించారు. పలువురి గుమాస్తాల స్థానాలు సైతం మార్చారు. ఈ మేరకు సీఈఓ శివశంకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెండోసారి మండల కన్వీనర్‌గా నరేంద్రనాయుడు



తాడిపత్రి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్‌గా కూరపాటి నరేంద్రనాయుడిని రెండోసారి ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. స్థానిక తన స్వగృహంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నరేంద్రనాయుడు మండలంలో పలు అభివృద్ధి పనులు చేసి.. అన్నివర్గాల ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, అందువల్ల అతన్ని మళ్లీ కన్వీనర్‌గా ఎంపిక చేశామని అన్నారు. నరేంద్ర మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెట్టింపు ఉత్సాహంతో పార్టీ, ప్రజా సేవ చేస్తానన్నారు.

న్యూస్ బాక్స్

తిరుపతిలో ధర్మవరం కళాకారుల ప్రదర్శన



తిరుపతిలో నృత్యం ప్రదర్శిస్తున్న ధర్మవరం కళాకారులు

ధర్మవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా మాడవీధులలో ధర్మవరం నృత్య కళాకారిణుల నృత్య ప్రదర్శన అలరించిందని ఆ బృందం నాట్యాచార్యులు మానస తెలిపారు. అమ్మవారికి మంగళవారం రాత్రి జరిగిన హంసవాహనం సేవలో ధర్మవరానికి చెందిన మానస నత్యకళా కేంద్రం బృందం నృత్య ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు. 25మంది నృత్యకళాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. అందులో శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి వేషధారణ భక్తులను ఆకట్టుకున్నట్టు మానస వివరించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి: ఎంఈఓ



కదిరిలో ఇందిరా గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడిమర్రి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో లభించే పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎంఈఓ కృష్ణమోహన్ తెలిపారు. 58వ జాతీయ గ్రంథాలయ వా రోత్సవాలను బుధవారం తాడిమర్రి ఉన్నతపాఠశాలలో నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎంఈఓ గ్రంథాలయ వారోత్సవాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శీనానాయక్, హెచ్ఎం అరుణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి నాగేంద్రకుమార్ రెడ్డి విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యత, డిజిటల్ యుగంలో పుస్తక పఠనం, వాటి విలువ తదితర అంశాలను వివరించారు.

● నంబులపూలకుంట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఎన్పీకుంట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో మహిళా సాధికారిత కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూల మాల లు వేసి, నివాళ్లు అర్పించారు. మహిళాసాధికారిత గురించి పలువు రు వక్తలు వివరించారు. గ్రంథాలయ అధికారి ఫరియాబాను, పీడీ సందీప్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

ఓబుళదేవరచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని బుధవారం ఘనం గా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమణ మాట్లాడుతూ... ఝాన్సీ లక్ష్మీబాయి చిన్నవయస్సులోనే దేశం కోసం బ్రిటీష్ వాళ్లతో పోరాటం చేసిందన్నారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వాసుదేవ, మాతృశ్రీ వృద్ధాశ్రమ నిర్వాహకురాలు అరుణజ్యోతి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నిజాం, హెడ్‌మాస్టర్ శిరీష, ఏబీవీపీ నాయకులు అఖిల్, వెంకటేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి చెకుముకి పరీక్షలు

కదిరి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలస్థాయి చెకుముకి పరీక్షల్లో విజేతలకు ఈ నెల 23న పెనుగొండ పట్టణంలోని గ్లోబల్ జెన్ పాఠశాలలో జిల్లాస్థాయి పరీక్షలు నిర్వహించనున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు నరసారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలస్థాయిలో విజేతలైన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకావాలన్నారు. జిల్లాస్థాయిలో విజేతలకు బహుమతులతో పాటు పరీక్షలకు హాజరైన ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రం, ప్రతి పాఠశాలకు ఒక జ్ఞాపిక అందజేస్తామన్నారు. విద్యార్థుల హాజరు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై శిక్షణ

అమడగూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ప్రధానోపాధ్యాయులకు ఫిజియోథెరపీపై హైదరాబాద్ నిజాం ఇనిస్టిట్యూట్ వైద్యులు రమేష్, సంతోష్ బుధవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఎంఈఓ జిలాన్ బాషా, రమణారెడ్డి, శ్రీనివాసులు, శివశంకర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్సిడీతో ఉలవల పంపిణీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాల కింద 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నారనీ, వాటిని రైతులు సద్వినియోగంచేసుకొని టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, సహకార సంఘం అధ్యక్షుడు తుమ్మల మహబూబ్‌బాషా పిలుపునిచ్చారు. స్థానిక రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం రైతులకు సబ్సిడీ ఉలవల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ డైరెక్టర్‌లు నిజాం, కంచి సురేష్, ప్రవీణ, బీజేపీ మండల అధ్యక్షుడు ఇడగొట్టు వీరాంజినేయులు, మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ అహ్మద్, వీఏఏ హనుమంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

తనకల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయ కేబుల్ చోరీకి పాల్పడ్డాడని నిందితుడు శంకర్‌ను గ్రామస్థులు మంగళవారం పోలీసులకు అప్పగిం చారు. ఈ విషయంపై రైతులు శంకర్‌రెడ్డి, మియాసాబ్, శివారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామాంజనేయులు బుధవారం తెలిపారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న రైతులు, పాలక మండలి సభ్యులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపల్లి, ఓబుళదేవర చెరువు సహకార సంఘంలో బుధవారం 72వ అఖిలభారత సహకార వారోత్సవా లను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార పతాకాన్ని సహకార సంఘం అధ్యక్షులు బోయపల్లి శివారెడ్డి, తుమ్మల మహబూబ్‌బాషా ఆవిష్కరించారు. డివిజనల్ సహకార అధికారి జనార్దన్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ షాహీద్‌భాషా, ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ సుమిత, సూపర్‌వైజర్ బ్రహ్మచారి, సీఈఓలు రామాంజినేయులు, రామ్మోహన్, సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ నిజాం, సురేష్, సాగునీటి సంఘం అధ్యక్షుడు బొడ్డు జయన్న, సొసైటి డైరెక్టర్‌లు శంకరప్ప, మునిలిరెడ్డి, నారాయణప్ప, బాలు తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించరూ..



సచివాలయం-2 వద్ద పేరుకుపోయిన చెత్త

కొత్తచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-2 ఎదుట చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు చెత్తను, వస్తువులను తెచ్చి సచివాలయం ఎదుట పడేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అవి పేరుకుపోయిన చెత్త దిబ్బలా తయారైందన్నారు. ఈ దారి గుండా సోమేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు వెళ్లే భక్తులు ఆ చెత్త నుంచి వచ్చే దుర్వాసనతో భరించలేకపోతున్నామని వాపోతున్నారు. చెత్తను తొలగించాలని పలుమార్లు పంచాయతీ అధికారులకు తెలియజేసిన పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రైతుకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

ఎమ్మెల్యే కందికుంట



రెండో విడత సాయం చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తోందని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. కదిరి పట్టణంలోని హిందూపురం రోడ్డులో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' పథకం కింద రెండో విడుత సహాయాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట మాట్లాడుతూ... పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం కింద కదిరి నియోజకవర్గంలోని రైతులకు రూ. 30.18 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వైసీపీ అధినేత జగన్ కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, ప్రభుత్వం ఏర్పడిన 18 నెలల కాలంలో సూపర్ సిక్స్ హామీలు అమలు చేశామో లేదో పిల్లల నుంచి పెద్దల వరకూ వెళ్ళి అడగాలని జగన్‌కు హితవు పలికారు.

హద్దుదాటితే కౌన్సెలింగ్: ఎమ్మెల్యే

నియోజకవర్గంలోని ప్రతిపక్షనాయకులు హద్దులు దాటి మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే కందికుంట మండిపడ్డారు. అలాంటి వారిని ఇన్నాళ్లు సహించామని, ఇంక హద్దులు దాటితే కౌన్సెలింగ్‌తోనే సమాధానం చెబుతామని పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో బుధవారం నిర్వహించిన పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమం తరువాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో పాలక పక్షంతోపాటు ప్రతిపక్షం ముఖ్యమన్నారు. స్వేచ్ఛగా ప్రభుత్వ తప్పులను ఎత్తి చూపడానికి అవకాశమిస్తే, కొంత మంది నాయకులు ఇష్టారాజ్యంగా నోరు పారేసుకుంటున్నారని అన్నారు. హద్దులు దాటి ప్రవర్తించే వారి గురించి ఇప్పటికే పోలీసులకు చెప్పామన్నారు. పలువురు మీడియా ప్రతినిధులు కూడా తప్పుడు రాతలు రాస్తే అది స్థాయిలో సమాధానమిస్తామని హెచ్చరించారు. అక్రమ లేఅవుట్ల వ్యాపారం మోసపూరితమన్నారు. వాటిలో ప్లాట్లు కొనుగోలు చేస్తే ప్రజలు నష్టపోతారన్నారు. ఇప్పటికైనా వారు మోసాన్ని మానుకోవాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధిగురించి ఏచర్చకేనా తాము సిద్ధమన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి ఉన్నారు.

వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే సింధూరారెడ్డి



అన్నదాత సుఖీభవ చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

కొత్తచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు వ్యవసాయం పెట్టుబడి సాయం అందిస్తున్నాయని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పోతు కుంట గ్రామంలో పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో పాలనలో కష్టనష్టాలు ఎన్ని ఉన్నా రైతులకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్‌తో కలిపి ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేస్తున్నారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 44,340 మంది రైతులకుగాను రూ.29.95కోట్లు నగదును రైతుల ఖాతాల్లోకి జమచేశారన్నారు. ప్రతి రైతు ఈ నగదును సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం ప్రభుత్వం సబ్సిడీకింద అందజేసిన డ్రోన్‌ను మహిళా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి సతీశ్‌బాబు, టీడీపీ సీనియర్ నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, మండల, టౌన్ కన్వీనర్‌లు రామకృష్ణశీన, సహకార సంఘం అధ్యక్షుడు హరిప్రసాద్, టీడీపీ నాయకులు నాగేంద్రప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ రక్షణకు ముందుండాలి'

ధర్మవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణకు, న్యాయవ్యవస్థ బలోపేతానికి, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడానికి న్యాయవాదులు ముందుండాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకె వినయ్‌కుమార్ పేర్కొన్నారు. గుంటూరులో ఈనెల 22న జరిగే రాజ్యాంగ దినోత్సవ మహాసభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ధర్మవరం కోర్టు ఆవరణంలో న్యాయవాదులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ... గుంటూరులో జరిగే మహాసభకు రాష్ట్ర న్యాయశాఖ మంత్రి, ప్రముఖ న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, మేధావులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నరసింహమూర్తి, ఇడపబత్తిని ప్రసాద్, రంగా నాయుడు, బాబా, అశోక్, విశ్వనాథ్, శివబాబు పాల్గొన్నారు.

'పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ' ప్రత్యక్ష ప్రసారం

అమడగూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేసే ప్రత్యక్షప్రసారాన్ని బుధవారం మండలకేంద్రంలోని గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోపాల్‌రెడి, రైతులు పాల్గొని వీక్షించారు. రైతులకు ఇచ్చిన హామీలన్నిటిని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందని రైతులు అభినందనలు తెలిపారు. మండల వ్యాప్తంగా 5,956 మందికి రూ. 2,97,80,000 అన్నదాత సుఖీభవ, 4867 మందికి రూ. 1,01,52,000ను రైతుల ఖాతాల్లో జయచేస్తున్నట్లు ఏఓ వెంకటరమణాచారి తెలిపారు. నాయకులు కాలేనాయక్, రామిశెట్టి, శ్రీనివాసులు, వేమనారాయణ, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

కాలువ ఆక్రమణపై చర్యలు తీసుకోండి

● మున్సిపల్ అధికారులకు టీడీపీ నాయకుల వినతి

ధర్మవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25 వ వార్డులో శ్మశాన వాటిక, ఇరిగేషన్ కాలువ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు మున్సిపల్ అధికారులను కోరారు. పట్టణంలోని 25వ వార్డులో ఆక్రమణకు గురైన ఇరిగేషన్ కాలువను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అలివేలమ్మ, సర్వేయర్ సోము, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సుధాకర్ బుధవారం పరిశీలించారు. ఈ నెల 8వ తేదీన కళ్యాణ దుర్గంలో జరిగిన భక్తకనకదాస విగ్రహావిష్కరణకు వెళ్లే సమయంలో ధర్మవరానికి వచ్చిన విద్యా, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు కలిశారు. ఇరిగేషన్ కాలువ, శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన మంత్రి నారా లోకేశ్ సంబంధిత అధికారులను ఆదేశించడంతో బుధవారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి అలివేలమ్మ, సర్వేయర్ సోము, సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సుధాకర్ వాటిని పరిశీలించారు. విచారించి శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణానికి చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కలిసొస్తే చర్యలు తీసుకోవడానికి వీలుంటుందని టౌన్‌ప్లానింగ్ అధికారి తెలిపారు. టీడీపీ నాయకులు చీమల రామాంజి, చీమల సూరి, క్లస్టర్ రామాంజి, అమర్, రవి పాల్గొన్నారు.

హమాలీల సమస్యలను పరిష్కరించాలి: ఓబులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బియ్యం గిడ్డంగులలో పని చేస్తున్న హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుళు, జిల్లా సివిల్ సప్లై హమాలీ యూనియన్ కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. వారు బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. అలాగే డిసెంబరు 31న విశాఖపట్నంలో సీఐటీయూ ఆల్ ఇండియా మహా సభలు ప్రారంభమవుతాయని, అందులో భాగంగా జనవరి 4న వైజాగ్ ఆర్‌కే బీచ్‌లో నిర్వహించే బహిరంగ సభకు కార్మికులందరూ హాజరై విజవయంతం చేయాలని కోరారు. హమాలీ యూనియన్ ఉపాధ్యక్షులు గంగాధర్, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు పెదబల్లి బాబా, మండల కన్వీనర్ రమణ, హమాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కుష్టు నివారణపై ర్యాలీ

ఓబుళదేవరచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధి నివారణపై బుధవారం మండలంలోని గౌనిపల్లిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. కుష్టు వ్యాధి నివారణ, వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీహెచ్ఓ ప్రమీలమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

13, 14 తేదీల్లో ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నీ

ధర్మవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నాగమణి మెమోరియల్ ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను డిసెంబరు 13, 14 తేదీలలో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు హైబ్రో చెస్ అకాడమి గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారావు, ఆర్గనైజింగ్ ప్రసిడెంట్ చాంద్‌బాషా, కార్యదర్శి ఈశ్వరప్ప, డైరెక్టర్ జాకీర్‌హుస్సేన్ కోరురు. స్థానిక స్వాతి క్లినిక్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొత్తపేటలోని సీతారామాంజనేయస్వామి కల్యాణమండపంలో రెండు రోజుల పాటు భోజన వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. వివరాలకు 9912647370 నంబరును సంప్రదించాలన్నారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం తదితరులు పాల్గొన్నారు.

కళాశాలను సందర్శించిన ఎన్‌సీసీ గ్రూపు కమాండర్

ధర్మవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అత్యున్నత స్థానానికి చేర్చడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తుందని కర్నూల్ ఎన్‌సీసీ గ్రూపు కమాండర్ కల్నల్ అలోక్ త్రిపాఠి పేర్కొన్నారు. పట్టణంలోని కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను బుధవారం కర్నూల్, అనంతపురం ఎన్‌సీసీ గ్రూపు కమాండర్‌లు కల్నల్ అలోక్ త్రిపాఠి, కల్నల్ మానీష్ సుబ్బా రోడ్రీజ్ సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రిన్సిపల్ ప్రభా కర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కల్నల్ అలోక్ త్రిపాఠి మాట్లాడుతూ..ఎన్‌సీసీ ప్రాధాన్యతను, అందులో చేరాల్సిన ఆవశ్యకతను వివరించారు. జీవితంలో అత్యున్నత స్థానానికి చేరడంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు గోపాల్‌నాయక్, భువనేశ్వరి, పుష్పావతి, ఆనంద్, మానీ, ధనుంజయ పాల్గొన్నారు.

శిల్పారామంలో సాంస్కృతిక సంబరాలు

పుట్టపర్తి టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో భాగంగా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 23 వరకు శిల్పారామంలో వివిధ కళాసంస్థల ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి అనంతపురానికి చెందిన శ్రీనృత్య కళానిలయం శ్రీమతి సంధ్యామూర్తి కళా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చంద్రహాసిని, ప్రణవ, బబిత, నిఖిత, వేదస్విత, దీక్షిత, హర్షవర్ధ తదితర చిన్నారుల బృందం చేసిన కూచిపూడి భరతనాట్యం, శివపాదం తదితర నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఎంతగానో అలంకరించాయి. ఈ సందర్భంగా పర్యాటక శాఖ అధికారి నరసయ్య మాట్లాడుతూ... దేశవిదేశాల నుంచి వస్తున్న సాయి భక్త జనులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా జిల్లా ప్రభుత్వ యంత్రాంగం అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం రామ్మోహన్, నృత్య కళాకారులు శిల్పారా మం ఏఓ ఖాదర్ వలి, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల నృత్య ప్రదర్శన



సాంస్కృతిక కార్యక్రమాలను తిలకిస్తున్న భక్తులు, ప్రజలు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నల్లమాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేసినందుకు బుధవారం టీడీపీ మండల నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు బుట్టి నాగభూషనాయుడు, కోట్లో మంజునాథ్‌రెడ్డి, రఫీఖాన్, విశ్రాంతి ఉపాధ్యాయులు లక్ష్మణ, నాగేనాయక్, కేశవ, టోపీసాబ్ తదితరులు పాల్గొన్నారు.

దోబీ ఘాట్‌కు రూ.10 లక్షలు మంజూరు

● గొట్లూరు సభలో ఎంపీ బీకే ప్రకటన



ఎంపీ బీకే పార్థసారథిని కలిసిన రజక సంఘం నాయకులు

ధర్మవరం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని గొట్లూరులో రజకుల దోబీఘాట్‌కు రూ.10లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎంపీ బీకేపార్థసారథి తెలిపారు. గొట్లూరులో బుధవారం జరిగిన అన్నదాత సుఖీభవ- పీఎంకిసాన్ నిధుల విడుదల కార్యక్ర మానికి ఎంపీ హాజరయ్యారు. ఆ గ్రామంలోని రజకులు ఎంపీ బీకేని కలిసి రజకవృత్తిపై ఆధారపడి జీవిస్తున్నామని, దోబీఘాట్, బోరుబావి లేక ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. వెంటనే స్పందించిన ఎంపీ దోబీఘాట్‌కు రూ.10లక్షలు, అదేగ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం మరిన్ని నిధులు విడుదల చేస్తానని ప్రకటించారు. దీంతో రజకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రజక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరమేశ్వర్, గొట్లూరు శ్రీరాములు, మధుబాబు, సంఘంనాయకులు తదితరులు ఎంపీని శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.

జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు పీఈటీ



పీఈటీ శివకృష్ణ

కొత్తచెరువు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు మండలంలోని కొడపగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న శివకృష్ణ ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్ఎం మంజులవాణి తెలిపారు. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ లాన్ టెన్నిస్ పోటీలలో శివకృష్ణ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం తెలిపారు. డిసెంబరు 16న జరిగే జాతీయ స్థాయి పోటీలలో శివకృష్ణ ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. శివకృష్ణను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పీవీఎస్ విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న చైర్మన్ పీవీ నాయుడు

ముదిగుబ్బ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని పీవీ పాఠశాల విద్యార్థి సునీల్ ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ పీవీ నాయుడు బుధవారం తెలిపారు. రాప్తాడులో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలుర ఖోఖో జట్టు ఎంపిక పోటీల్లో విద్యార్థి సునీల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ఆయన పేర్కొన్నారు. మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తూ రాష్ట్రస్థాయి జాబితాలో స్థానం సంపాదించడం తమ పాఠశాలకు గౌరవంగా ఉందన్నారు. ఆ విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పీవీ పాఠశాల ప్రిన్సిపాల్ మనీషా, ప్రధానోపాధ్యాయురాలు శోభ, పీఈటీ జ్యోతి యాదవ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతు విలవిల

రోజురోజుకీ తగ్గుతున్న ధరలు
క్వింటం ధర రూ.1800 నుంచి రూ.1900
పెట్టుబడి రావడమూ కష్టమే
ప్రభుత్వం కొనుగోలు చేయాలని వినతి


కొడికొండ చెక్‌పోస్టు వద్ద పంటను ఆరబెట్టుకున్న రైతులు

చిలమత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న రైతులకు ధరలు పెద్ద షాక్ ఇస్తున్నాయి. దానికి తోడు పంట దిగుబడులు కూడా తగ్గడంతో వారిలో నిరాశ నెలకొంది. మండలంలో ఈ ఖరీఫ్ సీజన్లో బోరుబావులు, వర్షాధారంగా 800 ఎకరాల వరకు మొక్కజొన్న సాగైంది. అయితే వర్షాధార పంటలు అంతంత మాత్రంగా దిగుబడులు రాగా, బోరుబావుల ఆధారిత పంటలు మంచి దిగుబడులే వచ్చాయి. గతేడాది కంటే ఈ ఏడాది మొక్కజొన్న ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పండిన పంటను తక్కువ ధరకు అమ్ముకోవడం ఇష్టం లేక నూర్పిడి చేసిన ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోలేక నానా తంటాలు పడుతున్నారు.

రోజు రోజుకు తగ్గుతున్న ధరలు

సాధారణంగా ప్రతి ఖరీఫ్ ప్రారంభంలో మొక్కజొన్నకు మంచి ధర లభించేది. ఖరీఫ్ ఆరంభం నుంచి ఆశించిన స్థాయిలో ధరలు పలకడం లేదు. క్వింటాకు ధర రూ. 1800 నుంచి రూ 1900 వరకు పలుకుతోంది. అందులో మంచి నాణ్యమైన పంటకు మాత్రమే ఈ ధర వర్తిస్తుంది. నాణ్యతలో తేడా ఉంటే దానికి మరో రేటు. ధరలు పడిపోవడంతోపాటు ఈ ఏడాది పంట దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో కనపడలేదు. గత ఏడాది ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. అయితే ఇప్పుడు మాత్రం ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే కనిపిస్తోంది. దీంతో ఒక పక్క ధర పెరగకపోవడం, మరో పక్క దిగుబడులు గణనీయంగా తగ్గిపోవడంతో రైతన్నలు విలవిలలాడుతున్నారు.

దళారులకు పండగే

సాధారణంగా పండించిన మొక్కజొన్నలను దళారుల సాయంతో రైతులు మార్కెట్లో అమ్ముకుంటుంటారు. దాంతో మార్కెట్లో ఉన్న ధర కంటే మరింత తక్కువ రేటుకి ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తుంది. ఈ తరుణంలో ఈ ఏడాది మొక్కజొన్నకు ధర లేకపోవడంతో రైతులే స్వయంగా దళారులను ఆశ్రయిస్తూ తమ ధాన్యాన్ని కొనాలను పట్టుబడుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న దళారులు మార్కెట్ ధర కంటే తక్కువకు ధాన్యాన్ని అడుగుతున్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోని రైతులు మార్కెట్ ధర కంటే దళారులు అడిగిన రేటుకే అమ్ముకుంటున్నారు. దీంతో మార్కెట్ ధర కంటే క్వింటాళ్లపై రూ. 100 నుంచి రూ. 150 తగ్గించి అమ్ముకోవాల్సి వస్తోంది. మార్కెట్‌లో ధర పెరగకపోవడంతో దానిని సాకుగా చూపి దళారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ ధరకే ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని సేకరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పెట్టుబడులు కూడా రావు..

పెట్టుబడులకు భయపడి ఇతర పంటల వద్దనుకొని రైతులు కొంత కాలంగా మొక్కజొన్నపై ఆసక్తి చూపుతున్నారు. అయితే రైతుకు అంతో ఇంతో లాభదాయకంగా ఈ పంట ఉంటూ వస్తోంది. దాని కారణంగా పంట సాగు విస్తీర్ణం కూడా పెరుగుతూ వస్తోంది. ఈ తరుణంలో పంట సాగుకు ఎకరానికి విత్తనం పెట్టినప్పటి నుంచి నూర్పిడి వరకు రూ. 30 వేల వరకు ఖర్చు వస్తుంది. పంట దిగుబడి బాగా వస్తే ఎకరానికి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. దీంతో క్వింటాళ్ల ధర రూ. 2200లు ఉన్నా ఎకరాకి రూ.66000 వరకు ఆదాయం వచ్చేది. ఈ ఏడాది పంట పెట్టుబడుల్లో మార్పు లేకున్నా దిగుబడి, ధరలు పడిపోవడంతో పెట్టిన పెట్టుబడులు కూడా దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వం కొనుగోలు చేయాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొక్కజొన్న పంటకు రూ.2400 మద్దతు ధర ప్రకటించింది. దీంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ మద్దతు ధర ప్రకటనతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న పంట సాగుపై ఆసక్తి చూపారు. అయితే పంట కోతలు ప్రారంభమైనా ప్రకటించిన మద్దతు ధరపై అధికారులు నిర్ణయిం తీసుకోకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. ప్రభుత్వం ముందుకు వచ్చి మండల కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తే కొంతైనా మద్దతు ధర దక్కుతుందని రైతులు ఆశపడుతున్నారు. మద్దతు ధర లభిస్తే దిగుబడులు తగ్గినా కొంత వరకు పెట్టుబడుల నష్టం జరగకుండా ఉంటుందని అంటున్నారు.

మద్దతు ధరతో కొనుగోలు చేయాలి



మొక్కజొన్న పంటకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించింది. మార్కెట్లో రోజురోజుకి ధరలు తగ్గుతున్నాయి. కష్టపడి పండించిన పంటను సరైన ధరకు అమ్ముకోలేకపోతున్నాం. పంటకోసి ఎక్కువ రోజులు నిల్వ ఉంచుకోలేం. అమ్ముకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయాలి.

-లక్ష్మయ్య, రైతు, మధురేపల్లి, చిలమత్తూరు మండలం

పెట్టుబడి రావడమే కష్టంగా ఉంది



మొక్కజొన్న ధరలు పడిపోవడంతో పంట పెట్టుబడులు కూడా తిరిగి రాకుండా పోతున్నాయి. నెల రోజులుగా క్వింటాళ్ల ధర రూ.1800 మాత్రమే పలుకుతోంది. ఇటీవల వర్షాలు కురవడంతో పంటలు కొంత నాణ్యత కోల్పోయాయి. దీనిని ఆసరాగా తీసుకున్న వ్యాపారస్థులు ధాన్యాన్ని మరింత తక్కువ ధరకు అడుగుతున్నారు. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరలో ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

-వెంకటేశులు, రైతు, కోట్లోపల్లి

బ్రహ్మోత్సవాలపై ప్రచారం చేయండి

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు... ప్రచార రథం ప్రారంభం


ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మడకశిరటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడిగుండ ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేసి ప్రచార రథాన్ని ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి బ్రహ్మరథోత్సవాన్ని ప్రారంభించారు. ఈనెల 30వతేదీ నుంచి డిసెంబరు 12వతేదీ వరకు భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడిగుండ అంజనేయస్వామి ఉత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈనెల 30వతేదీన అంకురార్పణం, డిసెంబరు 1న ధ్వజారోహణ, అగ్నిహోత్రం, 2న శ్రీమన్య సూక్త పవమాన కార్యక్రమం, 3న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం జరగనున్నాయి. 4న రథోత్సవం, 5న భూతప్పల ఉత్సవం, జ్యోతుల పరుష, 6న తలనీలాలు, పూలపల్లకి ఉత్సవం, 7న కంబాల నరసింహస్వామి జ్యోతుల పరుష, 8న చక్రస్నానం, వసంతోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


భరత్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మడకశిర రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో గుండమల ఎంజేపీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న భరత్‌కుమార్ డిస్కస్‌త్రోలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభకనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శివరామ్, పీఈటీ అంజలి తెలిపారు. ఈనెల 23, 24 తేదీల్లో పల్నాడులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో భరత్‌కుమార్ పాల్గొనునున్నారని పేర్కొన్నారు.

పరిగి: మండల పరిధిలోని శాసనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన శాలిని రాష్ట్రస్థాయి హామర్‌త్రో పోటీలకు ఎంపికైంది. జిల్లాస్థాయి అండర్-17విభాగంలో శాలిని ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పీడీ లోకేశ్వరి తెలిపారు. ప్రధానోపాధ్యాయులు శ్రీధర్‌మూర్తి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో సైతం రాణించి పాఠశాలకు మంచిపేరు తేవాలన్నారు.

'పొదుపుతోనే సంఘాల అభివృద్ధి'


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

మడకశిర రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొదుపుతోనే మహిళా సంఘాల అభివృద్ధి సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాపసానిపల్లి గ్రామంలో మహిళా సంఘాలకు ప్రభుత్వ పథకాలు, పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం మహిళా సంఘ సభ్యులు ర్యాలీ నిర్వహించారు.

టీడీపీ అనుబంధ కమిటీ ఏర్పాటు


తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి

చిలమత్తూరు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): టీడీపీ అనుబంధ విభాగాల కమిటీ నియామకం జరిగినట్లు కన్వీనర్ శ్రీనివాసులు తెలిపారు. నూతనంగా ఎంపికైన వారు పార్టీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. తెలుగు యువత మండల అధ్యక్షులుగా మురళీమోహన్, తెలుగు మహిళా అధ్యక్షురాలుగా విజయలక్ష్మి, బీసీ సెల్ అధ్యక్షులుగా అంజి, ఎస్సీ సెల్ అధ్యక్షులుగా ఆటో రామాంజి, ఎస్టీ సెల్ అధ్యక్షులు వెంకటరాముడు, మైనార్టీ అధ్యక్షులుగా గౌస్ బాషా, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులుగా హరీ‌ష్‌లను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

నాసా కిట్ల పంపిణీ

హిందూపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్య స్కూలుకు చెందిన 17 మంది విద్యార్థులు నాసాకంటెస్ట్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. వీరికి బుధవారం మున్సిపల్ చైర్మన్ రమేష్ నాసా కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో వైజ్ఞానిక, శాస్త్ర సాంకేతికంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపికైన వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ ప్రభాకర్‌రెడ్డి, డీన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులో జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ

అగళి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వాలీబాల్ టోర్నీని నిర్వహిస్తున్నట్లు క్రీడాకారులు కరియన్న, యశ్వంత్, మంజునాథ్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 13, 14 తేదీల్లో టోర్నీ ఉంటుందన్నారు. మొదటి బహుమతి రూ.33,333, రెండో బహుమతి 22,222, మూడో బహుమతి 11,111, నాల్గో బహుమతి 5,555 ఉంటుందన్నారు. డిసెంబరు 5వతేదీ లోపు జట్టు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 8688559036, 7799664868 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆర్థిక సాయం

గోరంట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బాలుడి వైద్య చికిత్స కోసం టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణీ, యువశేఖర్ బుధవారం ఆర్థికసాయం అందించారు. ఎస్సీకాలనీకి చెందిన నరసింహప్ప కుమారుడు 11 ఏళ్ల నవీన్‌కుమార్ తలసేమియా వ్యాధితో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ పరిస్థితి గమనించి చికిత్స నిమిత్తం రూ.10వేల నగదును నరసింహప్పకు అందించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

అమరాపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందింది. మండల పరిధిలోని హేమావతి పంచాయతీ గొల్లమార్లపల్లి గ్రామంలో బుధవారం ఉదయం మూడ్లి గిరియప్ప పొలంలో ఆవు విద్యుత్ స్తంభం అర్త్ కేబుల్‌వైరుకు తగలింది. వెంటనే విద్యుదాఘాతంతో మృతి చెందింది. అధికారులు స్పందించి రైతు గిరియప్పను ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

ఆర్ఓ ప్లాంట్‌ను తనిఖీ చేసిన కార్యదర్శి

సోమందేపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్‌ఓప్లాంట్ నిర్వహణపై సిబ్బంది పనితీరును పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున బుధవారం పరిశీలించారు. మండలంలోని మంచేపల్లి గ్రామంలో ఉన్న ఆర్‌ఓ ప్లాంట్ ట్యాంక్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ట్యాంక్‌ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి సరఫరాలో నాణ్యత ప్రమాణాలను గమనించాలన్నారు. ఆర్‌ఓ ప్లాంట్ నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై దాడులు ఆపాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

హిందూపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): దేశంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు ఆపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ర్యాలీగా వెళ్లిన సీపీఐ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సీపీఐ కార్యదర్శి వినోద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. వీటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. దేశంలో లౌకిక విధానాన్ని కాపాడాలని మత విద్వేషాలను ఆపాలన్నారు. ప్రజలందరికీ స్వేచ్ఛను కల్పించి రాజ్యాంగ హక్కులను కాపాడాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మారుతిరెడ్డి, నరసింహమూర్తి, రవి, చాంద్‌బాష, ముత్యాలప్ప తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా చెరువుకట్ట మరమ్మతులు


పనులు జరుగుతున్న చెరువుకట్ట ప్రాంతం

పరిగి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చెరువుకట్ట లీకేజీ అయ్యింది. కూటమి ప్రభుత్వం స్పందించి మరమ్మతులకు నిధులు విడుదల చేయడంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఈ చెరువుకట్ట లీకేజీ కావడంతో కిందున్న రోడ్డుకూడా గుంతలమయంగా మారింది. ప్రస్తుతం శరవేగంగా పనులు సాగుతున్నాయి.

అనాథలకు అంత్యక్రియలు

హిందూపురం, నవంబరు19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఒకరు, రైల్వేస్టేషన్ వద్ద మరొకరు మృతి చెందారు. అయితే వారి బంధువుల ఆచూకీ ఆరాతీయగా ఎవరూ రాకపోవడంతో తెలుగు యువత నాయకులు యుగంధర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో రెండు మృతదేహాలను తీసుకెళ్లి బుధవారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

నిందితుడి అరెస్ట్

హిందూపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్నారిపై అఘాయిత్యానికి ప్రయత్నించిన నిందితుడు గోపీని అరెస్ట్‌చేసినట్లు టూటౌన్ సీఐ కరీం తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఇందిరమ్మ కాలనీవద్ద అదుపులోకి తీసుకుని విచారించి అరెస్ట్‌చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నార్పల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన శీనయ్య (38) బైక్‌లో కూలిపనుల నిమిత్తం నార్పలకు వచ్చాడు. పనులు ముగించుకుని బుధవారం స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే బొందలవాడ సమీపంలోకి రాగానే అతివేగంతో వచ్చిన ఐషర్ ఢీకొంది. ప్రమాదంలో శీనా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ కుమార్ తెలిపారు.

13, 14 తేదీల్లో చెస్ టోర్నీ

ధర్మవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నాగమణి మెమోరియల్ ఆలిండియా ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను డిసెంబరు 13, 14 తేదీలలో నిర్వహించనున్నట్లు హైబ్రో చెస్ అకాడమీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బీవీ సుబ్బారావు, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ చాంద్‌బాషా, కార్యదర్శి ఈశ్వరప్ప, డైరెక్టర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. స్థానిక స్వాతి క్లినిక్‌లో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. కొత్తపేటలోని సీతారామాంజనేయ స్వామి కల్యాణమండపంలో రెండు రోజుల పాటు భోజన వసతి ఉచితంగా కల్పిస్తామన్నారు. వివరాలకు 9912647370 నంబరును సంప్రదించాలన్నారు. యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

మారనున్న పురం రూపురేఖలు

రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు


ఈనెల 16న సీసీరోడ్డు, మురుగు కాలువల పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

హిందూపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పురం అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. మునిసిపాలిటీ పరిధిలోని 38 వార్డుల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల ప్రాంతాల్లో కాకుండా పట్టణ నడిబొడ్డులో రహదారి, డ్రైనేజీలు లేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. తెలుగుదేశం హయాంలో సీసీరోడ్లు, కాలువలు మంజూరు చేయించారు. ఆ పనులు కూడా 2018 ఆఖరులో ప్రారంభమయ్యాయి. అయితే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం రావడం, ఆ పనులను కొనసాగించలేకపోయింది. పట్టణంలో అభివృద్ధి కొంతమేర కూడా జరగలేదని పట్టణవాసులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రావడంతో ప్రజల్లో ఆశలు చిగురించాయి. అనుకున్నవిధంగానే కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలలకే పట్టణ అభివృద్ధి కోసం రూ.100 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రత్యేక చొరవ చూపి హిందూపురం మునిసిపాలిటీ పరిధిలో రూ.92కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి మూడు రోజుల క్రితం భూమిపూజ చేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

పట్టణంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బాలకృష్ణ శ్రీకారం చుట్టారు. సీసీరోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి పైలాన్ ఆవిష్కరించారు. ఆదేవిధంగా పట్టణంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు సెంట్రల్ లైటింగ్, వీధి దీపాల ఏర్పాటు చేయనున్నారు. రూ.18 కోట్లతో నూతన మున్సిపల్ కార్యాలయాన్ని నిర్మించనున్నారు. ఇప్పటికే రైల్వేరోడ్డులో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి వాటి స్థానంలో ఐరన్ టవర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు రూ.2కోట్లు ఖర్చు చేస్తున్నారు. ముఖ్యంగా పట్టణప్రజలు ఎదురుచూస్తున్న రైల్వే రోడ్డుకు రూ.3కోట్లకుపైగా ఖర్చుచేయనున్నారు. పట్టణంలోని రహదారులకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ.5కోట్లు వెచ్చించనున్నారు.

నెరవేరుతున్న దశాబ్దాల కల

పట్టణంలో చాలాచోట్ల పెద్దపెద్ద భవంతులు ఏర్పాటు కావడంతో ఆ ప్రాంతంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంతా మునిసిపాలిటీకి పన్నులు చెల్లిస్తున్నా అభివృద్ధి లేకపోవడంతో తరచూ మున్సిపల్ కార్యాలయంలో వినతులు అందించారు. ఈ పరిస్థితుల్లో అలాంటి చోట సీసీరోడ్డు ఏర్పాటు కానున్నాయి. ఉదాహరణకు ఎన్‌జీఓ లేఅవుట్ ఏర్పాటై 20 ఏళ్లవుతున్నా ఇప్పటికీ సీసీరోడ్లు, డ్రైనేజీలు లేవు. అయితే ప్రస్తుతం ప్రారంభించిన పనుల్లో ఇక్కడ రహదారులు ఏర్పాటు కానున్నాయి. మరీ ముఖ్యంగా పట్టణంలోని రైల్వే రోడ్డు విస్తరణ, పుర ప్రజలకు తీరనికోరికగా ఉండేది. అలాంటిది త్వరలోనే ఆ పనులు ప్రారంభం కానున్నాయి. వీటితోపాటు మరికొన్ని అభివృద్ధి పనులకు సంబంధించి ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న పట్టణ ప్రజల సమస్యలు పరిష్కారం కానున్నాయి.

రైతుల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


దేవరహట్టిలో అన్నదాత సుఖీభవ చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే


పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లిలో చెక్కు విడుదల చేస్తున్న నేతలు

గుడిబండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని దేవరహట్టిలో స్థానిక టీడీపీ యువనాయకుడు క్లస్టర్ ఇన్‌చార్జి చిత్రశేఖర్ యాదవ్ తోటలో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదల సందర్భంగా రైతులతో కూటమి నాయకులు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకం కింద 43వేల మంది రైతులకు 30కోట్ల రూపాయలు నిధులను రెండో విడత కింద విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రతినెలా 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద వ్యక్తుల వికలాంగత్వాన్ని బట్టి రూ.4వేలు, రూ.6వేలు, రూ.15వేలు పెన్షన్ అందిస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం, సీఎం సహాయనిధి కింద లక్షలాది రూపాయలు అందించినట్లు తెలిపారు. గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ విద్యుత్ సౌకర్యంలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో అలాంటి రైతులకు దాదాపు 500 ట్రాన్స్‌ఫార్మర్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కింద రైతులకు మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, రాష్ట్ర వక్కళిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తిస్వామి, గుడిబండ మండల టీడీపీ కన్వీనర్ నరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప, న్యాయవాది సుకుమార్, జిల్లా లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, ఎస్సీసెల్ అధ్యక్షులు మంజునాథ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పీఏ వీరయ్య, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు

చిలమత్తూరు(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏ వీరయ్య, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, బాలాజీ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమల్లో భాగంగా ప్రభుత్వం అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో చిలమత్తూరులో డివిజన్‌స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. సభా ప్రాంగణంలో ముఖ్యమంత్రి అన్నదాత సుఖీభవ నిధుల విడుదల చేసే కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. అనంతరం రైతులకు అన్నదాత సుఖీభవ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసరావు, పీఏ వీరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులను ఏ విధంగా ఆదుకున్న దాఖలాలు లేవన్నారు. అయితే సీఎం చంద్రబాబునాయుడు రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఆదుకుంటున్నారన్నారు. అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడారు. వారి సందేహాలకు అక్కడికి వచ్చిన వ్యవసాయశాఖ అధికారులు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శ్రీనివాసులు, వ్యవసాయ శాఖ ఏడీఏ క్రిష్ణయ్య, ఏడీఎస్ రాజు, చిలమత్తూరు ఏఓ కవితారాణి, హిందూపురం ఏఓ సురేంద్ర, లేపాక్షి ఏఓ శ్రీలత, పరిగి ఏఓ శ్రీక్రిష్ణ, హార్టికల్చర్ అధికారి మహేష్, పట్టుశాఖ అధికారి తులసీనాయక్, ఏఈఓలు శ్రీవిద్య, మల్లికార్జున, మోహన్, నాయకులు బేకరీ గంగాధర్, అంజినప్ప, గౌరీశంకర్, బయప్ప, లక్ష్మీనరసప్ప, అశ్వర్థప్ప, నందీషప్ప, బయపరెడ్డి, నంజుండప్ప తదితరులు పాల్గొన్నారు.

● పెనుకొండ రూరల్: నియోజకవర్గంలో 42వేల మంది రైతులకు రూ.50కోట్లు నిధులు మంజూరైనట్లు ఏడీఏ కృష్ణమీనన్, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కేశవయ్య, మండల కన్వీనర్లు ఈశ్వరప్రసాద్, శ్రీరాములు పేర్కొన్నారు. మెగా చెక్కును వారు విడుదల చేశారు. వెంకటరెడ్డిపల్లి గ్రామంలోని ఓ రైతు పొలంలో కూటమి నాయకులు, అధికారులు డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేసే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ చందన, రెడ్డివారి మంజునాథ్, సింగిల్‌విండో అధ్యక్షులు పోతిరెడ్డి, నారాయణస్వామి, గొందిపల్లి సూరీ, గుట్టూరు సూరీ, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

● అగళి: అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు సంబంధించి రెండో విడత నిధులు రూ.2.87కోట్లు మండలానికి మంజూరైనట్లు ఏఓ నాగరాజు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం కింద 5747మంది రైతులకు రూ.2.87కోట్లు, పీఎం కిసాన్ పథకం కింద 4426మంది రైతులకు రూ.89లక్షలు జమ కానున్నట్లు పేర్కొన్నారు.


చిలమత్తూరులో మాట్లాడుతున్న కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు